పూజారులకు గౌరవ వేతనాలు అందజేత

పూజారులకు గౌరవవేతనం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, మార్చి 21: అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ప్రతి రోజూ ధూప దీప, నైవేద్యం సమర్పిస్తున్న పూజారులకు ప్రతి నెలా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవ వేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే.. గురువారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెలకు సంబంధించి 11 మంది పూజారులకు రూ. 5 వేల చొప్పున మొత్తం 55 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

గోల్నాక, మార్చి 21 : గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్‌కు వారు ఫిర్యాదు చేయగా ఆమె ఆదేశాలతో గురువారం సమస్యను బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్‌హోళ్లలో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగింప చేయించి సమస్యను పరిష్కరించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రాణాలు పదిలం

నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

నిజాం కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, చిత్రంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ భీమ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి , తదితరులు

సుల్తాన్‌బజార్,మార్చి 21: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రాణాలు పదిలంగా ఉంటాయని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ గాండ్ల శంకర్‌రాజు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నిజాం కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్,ట్రాఫిక్ పోలీస్, రోడ్డు రవాణాశాఖ, నేషనల్ సర్వీస్ స్కీం సంయుక్తాధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన ట్రాఫిక్ రూల్స్ అనే అంశంపై సదస్సును నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ప్రతి ఏటా వేలాది మంది తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణకు ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ప్రమాదంలో పడుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు. తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతర ప్రాణాలను హరించకుండా ఉండాలంటే ట్రాఫిక్ రూల్స్ పాటించడంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై కొన్ని వీడియో లను, చిత్రాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వా రా ఆయన విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా మాట్లాడుతూ రోడ్డు భద్రత పై ప్రధానంగా యువ తరం,విద్యార్థులు అవగాహన చేసుకొని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం కళా శాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఉపేందర్‌రెడ్డి,అబిడ్స్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో రవి,నిజాం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్‌లు డాక్టర్ సీహెచ్ వెంక టేశ్వర్లు, డాక్టర్ మంజుల,సుదర్శన్,స్టూడెంట్ అడ్వై జర్ మహమ్మద్ అలీ, పీఆర్‌వో డాక్టర్ సీహెచ్ పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతున్న కొక్కుల దేవందర్

చిక్కడపల్లి, మార్చి 21: గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం కొక్కుల దేవేందర్ పద్మశాలి సంఘం నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్లు సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి పత్రం ఇచ్చారు.

'ఘంటసాల గంధర్వగానామృతం'

సినీ నటుడు సుమన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి,మార్చి21 : ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు భాషకు వరం ఘంటసాల స్వరం పేరుతో స్వరసమ్రాట్ డాక్టర్ టి.శరత్ చంద్ర సంగీత సార థ్యంలో 'ఘంటసాల గంధర్వగానామృతం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు సుమన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డబ్బుడబ్బుడబ్బు.ఐడల్ గంధర్వ, ఓఆర్‌జీ, డబ్బు,డబ్బు. ఐడల్‌గంధర్వ. కామ్ వెబ్ సైట్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..శ్రీ వేంకటేశ్వరస్వామి, సత్యనారాయణ, రాములవారి పాత్రలు దక్కడం భగవంతుడు ఇచ్చిన వరం అని పేర్కొన్నారు. అకాడమీ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సినీనటుడు శివారెడ్డి, సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ జీఎన్ఆర్ఎస్ఎస్ఎస్ వర ప్రసాద్, కొండపు సుధారని, , గుండు శ్రీనివాస్, పురుషోత్తం, వరంగల్ లా కళాశాల చైర్మన్ విద్యా సాగర్, పురుషోత్తం గౌడ్, జగదీశ్వర్, రంగనాథ్, పూర్వ మైనస్ డైరెక్టర్ డాక్టర్ వి.డి.రాజగోపాల్, సినీ నటుడు మొక్క రామకృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

చలివేంద్రం ప్రారంభం

అంబర్‌పేట, మార్చి 21: తిలక్‌నగర్ శ్రీ శివశంకర యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ బ్యాంకు ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎండాకాలంలో బాటసారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు అసోసియేషన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. దివాకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, సాయిని మూర్తి పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ నేత, సెట్విన్ మాజీ డైరెక్టర్ ధన్‌రాజ్ నివాసంలో శ్రీ సత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, తదితరులు పూజలో పాల్గొన్నారు. – అబిడ్స్, మార్చి 21

వేతన సమస్యలు పరిష్కరించాలని వినతి

చిక్కడపల్లి,మార్చి 21 : తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ బి. కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు వైద్యనాథ్ మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల బేసిక్ పేస్కేల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పే స్కేల్ తో సమానంగా ఉండాలని అని కోరడం జరిగిందని తెలిపారు. చైర్మన్ కూడా సనుకూలంగా స్పందించారని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శశిధర్‌రెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, సభ్యులు, విద్యార్థులు

వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

కాచిగూడ,మార్చి 21: విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకొని, కొత్త క్రీడలపై అధ్యయనం చేయాలని కాచిగూడ వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్-2024లో భాగంగా క్రికెట్ పోటీలను గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యకమంలో ప్రధాన కార్యదర్శి రవిప్రసన్నకుమార్, కోశాధికారి రాజేశ్వర్‌రావు, స్పోర్ట్స్ చైర్మన్ వీరబోమ్మ శ్రీనివాస్, భాస్కర్‌గుప్త, కూర జయరాం, వేలూరు కిషోర్‌గుప్త, రాజేశ్, మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగులను
వైద్యశాఖలో విలీనం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 21 : హెచ్ఐవీ ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగులను రాష్ట్ర ఆరోగ్య వైద్యశాఖలో విలీనం చేసి న్యాయం చేయాలని ప్రభుత్వానికి తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల సంఘం కోరారు. గురువారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం వివిధ జిల్లాల అధ్యక్షుడు టి.శివప్రసాద్, రంజిత్‌కుమార్ మాట్లాడారు. 20 సంపత్సరాలుగా అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో 800 లకు పైగా ఉద్యోగులు హెచ్ఐవీ రోగులకు సేవలందిస్తున్నామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దేవి నాగరాజు, నరేందర్, శ్యాంసుందర్,నాగమణి, సతీశ్, రవి పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

అంబర్‌పేట, మార్చి 21 : పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నల్లకుంట పోలీసులు గురువారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ రావు నేతృత్వంలో జరిగిన ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ పృథ్వీధర్‌రావు, ఓయూ ఏసీపీ జగన్, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. అంతా కలిసి పీఎస్ పరిధిలోని జండా గల్లీ, అడిక్‌మెట్, వడ్డెరబస్తీ, అంజయ్యనగర్, టీఆర్టీ క్వార్టర్స్, నర్సింహాబస్తీ, శంకర్‌మఠ్ తదితర ప్రాంతాలలో తిరిగారు.

కాచిగూడ డివిజన్ అభివృద్ధికి కృషి

కాచిగూడ, మార్చి 21: డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. చెప్పల్‌బజార్‌లో గురువారం మంచినీటిలో మురికి నీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించి వెంటనే జలమండలి అధికారులతో పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మురికి నీరు రాకుండా జలమండలి అధికారులతో చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య, పాల్గొన్న గుజ్జ కృష్ణ, భరత్‌కుమార్, తదితరులు

23 నుంచి బీసీ జోడో సామాజిక న్యాయయాత్ర

కాచిగూడ, మార్చి 21: తెలంగాణలోని 33 జిల్లాలలో ఈ నెల 23వ తేదీ నుంచి బీసీ జోడో సామాజిక న్యాయ యాత్రను నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 10 సీట్లు కేటాయించి, బీసీ డిమాండ్లపై విధి, విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 56 కార్పొరేషన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, కోట్ల శ్రీనివాస్, రాజేందర్, అంజి, సుధాకర్, రామకృష్ణ, అనంతయ్య, రాజ్‌కుమార్, కృష్ణ యాదవ్, వెంకటేశ్‌గౌడ్, జీడయ్యగౌడ్, సతీశ్, విశాల్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఒకే విధంగా పెన్షన్ అమలు చేయాలి

చిక్కడపల్లి, మార్చి20 : దేశంలో అన్ని రాష్ట్రాల్లో అర్హులైన దివ్యాంగులకు ఒకే విధంగా ఫించన్లు రూ.10వేలు అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్‌డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల మేనిపెస్టోలో పొందుపర్చాలని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఎం.పి. లాడ్స్ క్రింద రూ.25 కోట్లు నిధులు కేటాయించి దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ కో-కన్వీనర్ వి.భారతి, కె.వెంకటేశ్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, కరీం మున్నిషా తదితరులు పాల్గొన్నారు.

గరికపాటి కాళిదాసుకు కీర్తి పురస్కారం

తెలుగు వర్సిటీలో నెలకొల్పిన బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం స్మారక కీర్తి పురస్కారాన్ని జ్యూడిషియల్ అకాడమీ డైరక్టర్ మంగారి రాజేందర్, వర్సిటీ వీసీ కిషన్‌రావులు ప్రముఖ రంగస్థల నటుడు గరిక పాటి కాళిదాసుకు ప్రదానం చేసి సత్కరించారు.

– తెలుగు యూనివర్సిటీ

రామకృష్ణ చంద్రమౌళికి గౌరవ డాక్టరేట్ ప్రదానం

అంబర్‌పేట, మార్చి 21: అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా ప్రముఖ కవి, విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళికి ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. రామకృష్ణ చంద్ర మౌళి చిన్నతనం నుంచి కవితలు, పాటలు రాయడం. చంద్రమౌళి చంద్రికలు, చంద్ర మౌళి భారతం అనే రెండు పుస్తకాలు రాశారు. ఈ రెండు పుస్తకాలు సాహితిలోకంలో మంచి ఆదరణ పొందాయి. వీటితో పాటు సేవా కార్యక్రమలు చేయడంతో ఆయనకు గౌరవ డాక్టరేట్ దక్కింది.

చేగోనికి కీర్తి పురస్కారం

తెలుగు యూనివర్సిటీ :రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో గ్రంథాలయాల ఏర్పాటుకు, అభివృద్ధికి విశేష సేవలదిస్తున్నందుకుగాను సిటీ కళాశాల గ్రంథపాలకుడు చేగోని రవికుమార్‌కు 2022కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ము ఖ్య అతిథి విశ్రాంత జడ్జి మంగారి రాజేందర్, వర్సిటీ వీసీ ఆచార్య టి. కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ చేతుల మీదుగా అందుకున్నారు.

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా
జ్యోతిముదిరాజ్

సుల్తాన్‌బజార్, మార్చి 21: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా శీలం జ్యోతి ముదిరా జ్ నియామకమయ్యారు.ఈ మేరకు గురువారం మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సంజీవన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బి.జగన్ మోహన్ ప్రభుత్వ మల్లేపల్లి ఐటిఐలో సహాయ శిక్షణాధికారిగా విధులు నిర్వహిస్తున్న శీలం జ్యోతి ముది రాజ్‌కి నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు.

బీజేపీలో చేరిక..

అంబర్‌పేట, మార్చి 21 : బాగ్ అంబర్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, వి. రాముతో పాటు మరికొందరు గురువారం కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి మంత్రి కాషాయ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్. గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, శ్యాంరాజ్, చుక్క జగన్‌పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, మార్చి 21 : బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన లోయర్ ట్యాంక్‌బండ్ మారుతీనగర్‌లో జరిగింది. దోమల గూడ పోలీసులు తెలిపిన ప్రకారం.. కె. వెంకటేశం(55) తాపీ మేస్త్రి. కాలికి గాయం కావడంతో డాక్టర్లు మద్యం సేవించరాదని చెప్పారు. గాయంతో 12 రోజులుగా బాధపడుతున్న వెంకటేశం ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



నీఈ కాలనీవాసుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, మార్చి 21 : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో కిషన్‌రెడ్డికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. పలు కాలనీల్లో స్థానికులు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మొదట నందనవనం కాలనీలో బస్తీయాత్ర ప్రారంభమైంది. అక్కడ నుంచి నీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తర్వాత సంజయ్‌గాంధీ నగర్, సాయిబాబానగర్‌లలో పర్యటించి అక్కడ సాయిబాబా గుళ్లో సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం శారదానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రపంచానికి ఒక నాయకుడిగా, దేశానికి ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. దేశ అభివృద్ధి, దేశ గౌరవాన్ని వ్యతిరేకించే శక్తుల ఓట్లు ఎక్కువ పోలింగ్ జరిగే అవకాశం ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ దేశం కోసం, అభివృద్ధి కోసం పోలింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, నాయకులు సి.కృష్ణా గౌడ్, శ్యాంరాజ్, చుక్క జగన్ పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రధాన్యత

కాచిగూడ,మార్చి 21: క్రీడలకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రధాన్యత ఇస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల జర్మనీలో జరిగిన ఐక్య కల్నరి ఒలంపిక్స్ పోటీలలో నగరానికి చెందిన చెన్నై అమ్రిత ఇంటరేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌కు చెందిన శ్రేయ అనీశ్, జగన్, పునీత్ లైఫ్ కార్వింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్, అదే కళాశాలకు చెందిన ఆకాశ్, అంకిశ్ విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించిన సందర్భంగా గురువారం బర్కత్‌పుర నగర కార్యాలయంలో వీరిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందించాడు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ భూమినాదన్, ప్రిన్సిపాల్ చంద్రమోహన్, సీఈవో కవిత, నందకుమార్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్,సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజలకు అందించే అభివృద్ధి పనులలో నాణ్యతను పాటించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గం టోలీచౌకి, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో రూ 297 కోట్లతో జరుగుతున్న సీవరేజీ, మంచినీటి ,డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

– మెహిదీపట్నం మార్చి 21

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి

కవాడిగూడ, మార్చి 21 : ఉమ్మడి ఏపీలో సమైక్య ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం కోసం 18 ఏండ్ల ర్వీస్‌ను వదులుకున్న త్యాగధనుడు అప్పారి వెంకటస్వామి అని, ఆయన ఆశయ సాధన కోసం నేటి ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, చావ రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి(ఎవిఎస్) 23వ వర్ధంతిని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వెంకటస్వామి చిత్ర పటానికి నాయకులు డి.మస్తాన్‌రావు, సి.కమల కుమారిలతో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం, నాయకులు శ్యామ్ సుందర్, శరద, బుచ్చిరెడ్డి, నరసింహ, రామకృష్ణ, భాస్కర్‌రరావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ప్రకటించడంపై హర్షం

అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, తదితరులు

చిక్కడపల్లి,మార్చి 21: మున్నూరుకాపు కార్పొరేషన్ ప్రకటించడం హర్షణీయమని పలువురు మున్నూరుకాపు నాయకులు అన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ప్రకటించిన సందర్భంగా తెలంగాణ మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభను నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్, ఆగ్రో చైర్మన్ కాసులు బాలరాజు, సంగీత నాటక అకాడమీ చైర్మన్ పుంజాల అలేఖ్య, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, టీపీసీసీ అధికార ప్రతినిధి మహేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద మున్నూరు కాపులకు లబ్ధిచేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య పటేల్‌ను మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రవి పటేల్, యుత్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌పటేల్,సంఘం గ్రేటర్ హైదరాబాద్ సంఘం అధ్యక్షుడు ఆర్వీ మహేందర్ పట్లే, మనుమంతరావు పాల్గొన్నారు.

మెహిదీపట్నంలో ఎమ్మెల్యే పర్యటన

నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్‌లో ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి స్థానికులతో చర్చించారు. రోడ్లు, డ్రైనేజీ, సీవరేజీ పనులను పూర్తిచేయడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహ్మద్‌మాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు.– మెహిదీపట్నం మార్చి 21

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెలుగు యూనివర్సిటీ, మార్చి 21: గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నాంపల్లి రైల్వే సీఐ బి.ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. భరత్‌నగర్-బోరబండ రైల్వే స్టేషన్ల మధ్య గురువారం సుమారు 40సంవత్సరాల వ్యక్తి ఎంఎంటీఎస